


ఉద్యాన శాఖ సిబ్బందికి శిక్షణ

దుగ్గిరాల: స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఉద్యాన శాఖ సిబ్బందికి ఏఓ ఆర్.విజయబాబు శిక్షణ నిర్వహించారు. పంట దిగుబడి అంచనా, కోత ప్రయోగాలపై శిక్షణ ఇచ్చారు.



పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు 3 వేల క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, దిగువకు 41,086 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుత నీటిమట్టం 43.9377 టీఎంసీలు.



ఆర్‌ఓబీ పనుల పరిశీలన

నెహ్రూనగర్: శంకర్‌విలాస్ ఆర్‌ఓబీ నిర్మాణంలో తవ్విన మట్టిని తొలగించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం ఆదేశించారు. పనులను ఆయన పరిశీలించారు.



పత్రికా స్వేచ్ఛను హరించడం అప్రజాస్వామికం



నాణేనికి రెండోవైపు ప్రజల పక్షాన నిలుస్తూ, వాస్తవాలను ప్రచురిస్తూ, ప్రజలకు–ప్రభుత్వానికి వారధిగా ఉండే ఏ పత్రికా జర్నలిస్ట్ స్వేచ్ఛనైనా హరించడం అప్రజాస్వామికం. ఏమైనా అభ్యంతరాలు ఉంటే పత్రికాముఖంగా ఖండించాలనేగానీ ఎడిటర్‌పై అక్రమకేసులు పెట్టడం ఏ మాత్రం సమంజసం కాదు. సాక్షి లేదా మరేదైనా పత్రిక ఇచ్చిన వార్తా కథనాలతో ప్రభుత్వం విభేదిస్తే తప్పకుండా ఖండించవచ్చు. తమ కోణంలో చెప్పినా కానీ స్పందించలేని పక్షంలో ఆ సంస్థపై నోటీసులు ఇచ్చి చట్టరీత్యా చర్యలు తీసుకోవచ్చు. కానీ నేరుగా కేసులు నమోదు చేయడం సరికాదు.

– కారుమంచి రామారావు,
ఎస్సీ, ఎస్టీ రైట్స్ అండ్ యాక్ట్స్ స్టేట్ జనరల్ సెక్రటరీ

ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదకరం



పత్రికా స్వేచ్ఛ లోపించిన ప్రజాస్వామ్యం చాలా ప్రమాదకరం. మీడియా స్వేచ్ఛను పునరుద్ధరించడానికి నిష్పాక్షిక న్యాయపరమైన విచారణ, జర్నలిస్టుల సురక్ష చట్టాలు, ప్రభుత్వం – మీడియా సంబంధాల పారదర్శకత చాలా అవసరం. పత్రికా స్వేచ్ఛ అంటే మీడియా ఎటువంటి భయభ్రాంతులు లేకుండా ప్రభుత్వ హస్తం లేకుండా వార్తలను ప్రచురించే హక్కు కలిగి ఉండడం. కానీ నేడు పాత్రికేయులపై, మీడియా సంస్థలపై జరుగుతున్న దాడులు, అన్యాయంగా జరుగుతున్న అరెస్టులపై న్యాయ వ్యవస్థ జోక్యం చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

– కలకోటి సునీల్‌కుమార్, న్యాయవాది,
వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు

న్యూస్‌రీల్

13న జాతీయ లోక్ అదాలత్



గుంటూరు లీగల్: జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టు ప్రాంగణాల్లో ఈ నెల 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికళ్యాణ్ చక్రవర్తి బుధవారం తెలిపారు. లోక్ అదాలత్‌లో రాజీ పడ దగిన క్రిమినల్, సివిల్ కేసులు పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. కేసులు రాజీ చేసుకునేందుకు కక్షిదారులు, న్యాయవాదులు సహకరించాలని సూచించారు.

జేసీ బాధ్యతల స్వీకరణ



గుంటూరు వెస్ట్: జాయింట్ కలెక్టర్‌గా అశుతోష్ శ్రీవాత్సవ బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇప్పటి వరకు జేసీగా ఇక్కడ పనిచేసిన ఎ.భార్గవ్ తేజను ప్రభుత్వం ఈ నెల 3వ తేదీన బదిలీ చేసింది. ఆయన స్థానంలో వచ్చిన అశుతోష్ శ్రీవాత్సవను డీఆర్వో షేక్ ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏఓ పూర్ణచంద్రరావు, తహసీల్దార్లు వెంకటేశ్వర్లు, సుభాని, వెంకట స్వామి, మొహర్ కుమార్, కె.గోపాల కృష్ణ, కలెక్టరేట్‌లోని సెక్షన్ అధిపతులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

డాక్టర్ దుర్గాభార్గవికి మూడు బంగారు పతకాలు



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ పిల్లల వైద్య విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వనం దుర్గాభార్గవికి మూడు బంగారు పతకాలు దక్కాయి. మంగళవారం విజయవాడలో డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ 28వ స్నాతకోత్సవం సందర్భంగా గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం, బంగారు పతకాలు అందుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎండీ పీడియాట్రిక్స్‌లో అత్యధిక మార్కులు సాధించినందుకు డాక్టర్ ధర్మవరపు అమృతవల్లి మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు గోల్డ్ మెడల్, ఎండీ పీడియాట్రిక్స్‌లో ఉత్తమ అవుట్‌గోయింగ్ స్టూడెంట్‌గా గుర్తింపు పొందినందుకు డాక్టర్ కృష్ణారావు పురోహిత్ గోల్డ్ మెడల్, ఎండీ పీడియాట్రిక్స్ పార్ట్–2 పరీక్షల్లో మొదటి ప్రయత్నంలోనే ఉత్తీర్ణత సాధించి ఉత్తమ డిజర్టేషన్ సమర్పించినందుకు ఎస్వీరావు అండ్ ఎంఎం స్వామి గోల్డ్ మెడల్‌ను డాక్టర్ దుర్గాభార్గవి అందుకున్నారు. మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి.సుందరాచారి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ, పిల్లల వైద్య విభాగాధిపతి డాక్టర్ దేవకుమార్, పలువురు పిల్లల వైద్య నిపుణులు ఈ సందర్భంగా ఆమెను అభినందించారు.

తురకపాలెంలో ఆర్‌ఎంపీ క్లినిక్ సీజ్



గుంటూరు రూరల్: మండలంలోని తురకపాలెం గ్రామంలో అనధికారికంగా వైద్య సేవలు అందిస్తున్న ఒక ఆర్‌ఎంపీ క్లినిక్‌ను జిల్లా వైద్య అధికారి డాక్టర్ కె. విజయలక్ష్మి బుధవారం సీజ్ చేశారు. ఆర్‌ఎంపీ వైద్యుడు సెలైన్లు, అధిక మోతాదులోని యాంటీబయాటిక్స్ రోగులకు అందిస్తున్నట్లు రుజువు కావటంతో ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఆర్‌ఎంపీలు కేవలం ప్రథమ చికిత్సకు మాత్రమే అర్హులని గుర్తుచేశారు. దానికి మించి చికిత్సలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పేర్కొన్నారు.

స్మార్ట్ పరేషాన్

అడ్డగోలు పంపిణీతో కార్డుదారుల్లో గందరగోళం

కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా నిర్వహిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో గందరగోళం నెలకొంది. తొలుత సచివాలయ సిబ్బంది కార్డుల ను ఇంటి వద్దకే వచ్చి ఇస్తారని ఉన్నతాధికారులు తెలిపారు. ఆ తర్వాత సంబంధిత రేషన్ దుకాణదారుల వద్దకు వచ్చి తీసుకోవాలని సచివాలయ సిబ్బంది ప్రజలకు చెప్పారు. మరోవైపు కొందరి కార్డులు కనీసం ఉన్నాయో, లేవో కూడా తెలియడం లేదు.

- సచివాలయ సిబ్బంది, రేషన్ దుకాణదారుల మధ్య సమన్వయలోపం
- అరకొర సమాచారంతో ప్రజలకు తప్పని కష్టాలు
- కార్డులు ఎక్కడ ఉన్నాయో తెలియక అయోమయం
- పౌరసరఫరాల శాఖ మంత్రి సొంత జిల్లాలోనే సమస్య తీవ్రం



వారం కిందట గుంటూరులోని కృష్ణా నగర్‌లో స్మార్ట్ కార్డు పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది

గుంటూరు వెస్ట్: స్మార్ట్ కార్డుల పంపిణీని రేషన్ దుకాణదారులు పూర్తిగా వ్యతిరేకించారు. రేషన్ పంపిణీ సమయంలో కార్డులందించలేమని కరాఖండిగా చెప్పేశారు. దీంతో తొలుత సచివాలయం అని చెప్పి అధికారులు... మళ్లీ అక్కడికే రావాలని పేర్కొన్నారు. ఇలా కొన్ని రోజుల నుంచి కార్డులు ఎక్కడ ఇస్తారో తెలీక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. సాక్షాత్తూ రాష్ట్ర పౌర సరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్ సొంత జిల్లాలోనే ఇలా జరుగుతుంటే.. మిగతా ప్రదేశాల్లో పరిస్థితి ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

20 శాతం కూడా దాటని పంపిణీ

జిల్లాలో 5,85,615 స్మార్ట్ కార్డులు పంపిణీ చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు 20 శాతం కూడా పూర్తి కాలేదు. పైగా అసలు తమ కార్డులు ఎక్కడ ఉన్నాయో తెలీక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొన్ని సచివాలయాల్లో సమాచారం చెప్పకపోగా, నిర్లక్ష్యపు జవాబులు ఇస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. కొందరు సచివాలయ సిబ్బంది కార్డులను ఇంటి వద్ద ఇవ్వకుండా రేషన్ దుకాణాల వద్దకు వెళ్లి పంపిణీ చేసిన సందర్భాలు ఉన్నాయి. ఈ అంశంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన 10 సచివాలయాల్లోని సిబ్బందికి అధికారులు షోకాజ్ నోటీసుల ఆలోచనతో సరిపెట్టారు.

నాడు ఇంటికే సరకులు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఇంటి ముంగిటకే రేషన్ సరుకులు అందించారు. ముఖ్యంగా రేషన్‌ను ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే సరఫరా చేసి ప్రజల మన్ననలు పొందింది. ఈ విధానంలో అక్రమాలు కూడా చాలా వరకు తగ్గుముఖం పట్టాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంటి వద్దకే రేషన్ విధానాన్ని తొలగించింది. ఇప్పుడు స్మార్ట్ కార్డుల పంపిణీ పేరుతో మరో గందరగోళానికి తెరతీసింది. ముఖ్యంగా జిల్లా సరఫరాల శాఖలో ఇన్‌చార్జ్‌ల పేరుతో అధికారులను నియమిస్తున్నారు. వీరికి రెండు మూడు శాఖలుండడంతో పూర్తి స్థాయిలో తమ సమయాన్ని దీనికి కేటాయించలేకపోతున్నారు. జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ ఈ నెల 3వ తేదీని బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో కనీసం రివ్యూ కూడా జరగడం లేదు. ఇటీవల ఓ ప్రజాప్రతినిధి తన పీఏను సచివాలయానికి పంపి వాకబు చేయగా అక్కడ పంపిణీ విధానంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

కార్డు ఎక్కడ ఉందో చెప్పడం లేదు

సచివాలయంలో స్మార్ట్ కార్డ్ తీసుకోవాలని చెప్పారు. వెళితే ఇక్కడ లేదంటున్నారు. ఎక్కడ ఉందో చెప్పాలంటే సిబ్బంది సర్వేకు వెళ్లారు.. వచ్చిన తర్వాత రమ్మని అంటున్నారు. చిన్న చిన్న పనులు చేసుకుని జీవించే మేం ఇన్నిసార్లు ఎలా తిరగాలి? అస్సలు మా కార్డు ఉందో, లేదో తెలీడం లేదు.



–ఎం.బాలమ్మ,
కోబాల్డ్ పేట

సర్వేల నుంచి విముక్తి కల్పించండి

ప్రస్తుతం గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందిపై ప్రభుత్వం తీవ్రమైన ఒత్తిడి పెడుతోంది. స్మార్ట్ కార్డుల పంపిణీ వెనుకబడటానికి పనిభారం కారణం. మమ్మల్ని మాతృ శాఖల్లో విలీనం చేయాలని ఉన్నతాధికారులకు నోటీసు లందించాం



–షేక్ అబ్దుల్ రజాక్,
రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ గ్రామ, వార్డు సచివాలయాల ప్రభుత్వ ఉద్యోగుల సంఘం.

ఆర్థికసేవల్లో ప్రజా పాలకుడు నాగరాజు

- ప్రజల శాస్త్రవేత్త నాయుడమ్మ అవార్డు ప్రదానం సముచితం
- తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



నాయుడమ్మ చిత్రపటానికి నివాళి అర్పించిన జిష్ణుదేవ్ వర్మ, నాగరాజు, స్వర్ణ, రఘునాథ బాబు, సుబ్రహ్మణ్యం

తెనాలి: శాస్త్రవిజ్ఞానాన్ని గ్రామీణులకు చేరువ చేసిన ప్రజల శాస్త్రవేత్త డాక్టర్ యలవర్తి నాయుడమ్మ అవార్డును ఆర్థికరంగంలో పీపుల్స్ అడ్మినిస్ట్రేటర్‌గా గుర్తింపు పొందిన మద్దిరాల నాగరాజుకు బహూకరించటం సముచితమని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. డాక్టర్ యలవర్తి నాయుడమ్మ సైన్స్ అండ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఏర్పాటైన ప్రత్యేక సభకు ఫౌండేషన్ అధ్యక్షుడు యడ్లపాటి రఘునాథబాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ.. శాస్త్ర విజ్ఞానం ప్రజల పురోభివృద్ధికి తోడ్పడేందుకు నాయుడమ్మ తపించారన్నారు. ఆ దిశగా జీవిత కాలం పనిచేసి ఎన్నో విజయాలను సాధించారని చెప్పారు. వికసిత్ భారత్‌కు వెన్నెముక అయిన ఆర్థికరంగంలో నాగరాజు, పరిపాలనను ప్రజల వద్దకు తీసుకెళ్లారని చెప్పారు. త్రిపుర ఉప ముఖ్య మంత్రి / ఫైనాన్స్ మంత్రిగా ఉన్నపుడు ఆ రాష్ట్ర ఫైనాన్స్ కార్యదర్శిగా ఉన్న నాగరాజుతో బడ్జెట్ రూపకల్పనలో అనుభవాన్ని ఈ సందర్భంగా గవర్నర్ గుర్తు చేసుకున్నారు.

నాయుడమ్మ స్ఫూర్తితో సాధిస్తాం

చెన్నైలోని జాతీయ చర్మ పరిశోధన సంస్థ ముఖ్య కార్యదర్శి డాక్టర్ స్వర్ణ వి.కాంత్ తన ప్రసంగంలో డాక్టర్ నాయుడమ్మను 'నేషన్ బిల్డర్'గా అభివర్ణించారు. విదేశాలు టారిఫ్‌లు పెంచిన నేపథ్యంలో ఎగుమతులు ప్రధానమైన తోలు పరిశ్రమలో 2030 నాటికి 50 బిలియన్ డాలర్ల వృద్ధి నిజంగా సవాలు అని, నాయుడమ్మ స్ఫూర్తితో సాధిస్తామని చెప్పారు. ఫౌండేషన్ వైస్‌చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం తమ లక్ష్యాలను వివరించారు. తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ మాట్లాడుతూ.. సాటి మనిషిని అంటుకుంటే పాపమనే మకిల మనస్తత్వాలను శుద్ధిచేసిన సామాజిక శాస్త్రవేత్త, చర్మకారుల చేతివాసనలనే కాదు... సమాజానికి పట్టిన ఆధిపత్య దుర్వాసనలను కూడా తుడిచేసిన పరిశోధకుడిగా, మానవతావాదిగా నాయుడమ్మ ప్రజల హృదయాల్లో నిలిచి పోయారని చెప్పారు. తొలుత డాక్టర్ నాగరాజుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతులమీదుగా నాయుడమ్మ అవార్డును ప్రదానం చేశారు. నాగరాజు దంపతులను సత్కరించారు. నాయుడమ్మపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లను బహూకరించారు. యడ్లపాటి స్వరూపరాణి, అయినాల మల్లేశ్వరరావు, తమిరిశ అనంతాచార్యులు, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు. తొలుత నాయుడమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

సమాజాభివృద్ధికి కృషి

అవార్డు గ్రహీత మాట్లాడుతూ... భారత్ ఆధునికతను సంతరించుకుంటున్న రోజుల్లో డాక్టర్ నాయుడమ్మ తన పరిశోధనలు, ఆవిష్కరణల ప్రయోజనాలను పరిశ్రమలకే కాకుండా సమాజానికి ఉపయోగపడేలా చేశారని చెప్పారు. ఇటీవల మన గ్రామీణ భారతదేశం గొప్ప ప్రతిభ చాటిందన్నారు. దేశంలోని ఎంఎస్‌ఎంఈలు 11 కోట్ల మందికిపైగా ఉపాధి కల్పిస్తూ వికసిత్ భారత్‌కు ఇంజిన్లుగా ఉన్నాయని, డిజిటల్ మౌలిక వసతులు పునాదిగా ఉన్నట్టు నాగరాజు చెప్పారు. ఈ డిజిటల్ నిర్మాణం కేవలం జాతీయ విజయం మాత్రమే కాదని, ప్రపంచానికి ఒక నమూనాగా వివరించారు. ఇంతటి ఘన విజయాలు అన్నింటికీ పలు వాణిజ్య బ్యాంకులు దిక్సూచిగా నిలిచాయన్నారు.

బోధన, పరిశోధనల్లో ఏఎన్‌యూ ప్రత్యేకత

- ప్రొఫెసర్ జి. చెన్నారెడ్డి
- నేడు ఏఎన్‌యూ వ్యవస్థాపక దినోత్సవం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ జి.చెన్నారెడ్డి

పెదకాకాని(ఏఎన్‌యూ): బోధన, పరిశోధనల్లో ప్రత్యేకత చాటుతూ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పేరొందిందని ప్రొఫెసర్ జి.చెన్నారెడ్డి అన్నారు. వర్సిటీ 49వ వ్యవస్థాపక దినోత్సవం గురువారం జరగనుంది. బుధవారం డైమెన్ హాల్‌లో మీడియా కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం జరిగింది. ప్రొఫెసర్ వి.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ చెన్నారెడ్డి మాట్లాడుతూ... గుంటూరు జిల్లా నల్లపాడులో ఆంధ్ర విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేట్ కేంద్రంగా ప్రారంభమై, స్వతంత్ర విశ్వవిద్యాలయంగా ఆవిర్భవించిందన్నారు. ఏఎన్‌యు ప్రాంగణంలో ఆర్ట్స్, సైన్స్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఇంజినీరింగ్ వంటి ఆరు కళాశాలలు ఉన్నాయని చెప్పారు. నేడు రెగ్యులర్ విధానంలో 65 యూజీ, పీజీ, వృత్తి విద్య కోర్సులు, దూరవిద్య విధానంలో 43 కోర్సులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ప్రొఫెసర్ డాక్టర్ జ్యోతిర్మయి మట్లాడుతూ సీఎస్ఆర్, సెంటర్ ఫర్ ఉమెన్ స్టడీస్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధ్యయన కేంద్రం, మహాత్మ జ్యోతిరావు పూలే అధ్యయన కేంద్రం, బాబు జగ్జీవన్‌రామ్ చైర్, సెంటర్ ఫర్ గాండియన్ స్టడీస్ డాక్టర్ కొత్త సచ్చిదానందమూర్తి అధ్యయన కేంద్రం నెలకొల్పినట్లు గుర్తుచేశారు. పూర్వ వీసీలు, ప్రొఫెసర్లు వేడుకలకు హాజరుకానున్నారని చెప్పారు. ముఖ్యఅతిథిగా వీసీ ఆచార్య కె.గంగాధరరావు హాజరుకానుండగా, పూర్వ వీసీలు ప్రొఫెసర్ డి. రామకోటయ్య, ప్రొఫెసర్ సీవీ రాఘవులు, ప్రొఫెసర్ ఎల్. వేణుగోపాల్ రెడ్డి, ప్రొఫెసర్ వి. బాలమోహన్‌దాస్, ప్రొఫెసర్ వై.ఆర్. హరగోపాల్‌రెడ్డి, ప్రొఫెసర్ ఎ.రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొంటారని వివరించారు. సమావేశంలో డాక్టర్ కె. శశిధర్, డాక్టర్ ఎస్.బాబు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

భారీ యంత్రాలతో పనులు చేయిస్తున్న అక్రమార్కులు



మట్టి తవ్వకాల తర్వాత పక్కనపెట్టిన యంత్రాలు

తాడేపల్లి రూరల్: కృష్ణానది కరకట్ట లోపల ప్రభుత్వం పేద ప్రజలకు అందించిన అసైన్‌మెంట్ భూముల్లో రాత్రి పగలు తేడా లేకుండా మట్టితవ్వకాలు నిర్వహిస్తున్నారు. తాజాగా తాడేపల్లి రూరల్ పరిధిలోని చిర్రావూరు గ్రామంలో పెద్ద యంత్రాలతో తవ్వకాలు మళ్లీ ప్రారంభించారు. 2015–16 సంవత్సరాల్లో ఇలాగే అసైన్‌మెంట్ భూముల్లో తవ్వకాలు నిర్వహిస్తుంటే పది జేసీబీలు, 40 ట్రాక్టర్లను సీజ్ చేసి తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి తాడేపల్లి రూరల్‌లోని గుండిమెడ, ప్రాతూరు, చిర్రావూరు తదితర ప్రాంతాల్లో అసైన్‌మెంట్ భూముల్లో మట్టితవ్వకాలు పూర్తిగా నిలిచిపోయాయి.

జేబులు నింపుకొంటున్న మాఫియా

తిరిగి కొంతమంది రైతులను మట్టి మాఫియా వారు మభ్యపెట్టి నామమాత్రంగా నగదు ఇచ్చి తవ్వకాలు నిర్వహిస్తున్నారు. ట్రాక్టర్ మట్టిని రూ.2500 నుంచి రూ.4 వేల వరకు మాఫియా అమ్ముతోందని స్థానికులు తెలియజేశారు. అసైన్‌మెంట్ భూముల్లో వ్యవసాయం చేసుకోవడానికి భూములు ఇస్తే కొంతమంది వాటిలో మట్టితవ్వకాలు నిర్వహిస్తున్నారని, దీనివల్ల పక్కనే పంట భూములకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కృష్ణానదికి 3 లక్షల నుంచి 4 లక్షల క్యూసెక్కుల వరద వస్తే ఈ అసైన్‌మెంట్ భూముల్లోకి నీరు చేరుతుందని, తవ్వకాలు వల్ల పక్కనే ఉన్న భూమి సైతం కొట్టుకుపోయే పరిస్థితి ఉందని వాపోయారు.

కాసులిస్తే 'కమిటీ'లో చోటు!

ఆలయ పదవుల నియామకానికి కూటమి నేతల వసూళ్లు

గుంటూరు నగరంలోని దేవదాయ శాఖ ఆలయాలలో పదవులు అమ్మకానికి పెట్టారు. కూటమి ప్రభుత్వ పాలనలో నేతలు నిర్ణయించిన ధరకే వేలంపాట పెట్టి మరీ విక్రయిస్తున్నారు. పాత గుంటూరులోని శ్రీ అగస్తేశ్వరస్వామి, శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం, కొత్తపేట శివాలయం, చౌత్రాలోని రామాలయం తదితరాల్లో పదవుల భర్తీకి నోటిఫికేషన్ జారీ అయింది. స్థానిక ప్రజాప్రతినిధి పేరు చెప్పి ఒక సెల్‌షాప్ నిర్వాహకుడు, కూటమి ప్రజాప్రతినిధి పీఏ అని చెబుతున్న వ్యక్తులు భర్తీలో చక్రం తిప్పుతున్నారు.

- ఎవరూ అడిగినా నో చెప్పని తూర్పు నియోజకవర్గ ప్రజాప్రతినిధి
- తన మాట వినే వారికే అన్నింటా అడ్డగోలు దారిలో పెద్దపీట



దేవదాయ, ధర్మదాయ శాఖ కార్యాలయం

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన నాటి నుంచి ఆలయాలను సైతం దోపిడీ వనరులుగా మార్చుకుంటున్నారు. పట్నంబజారులో వేంచేసియున్న శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయానికి సంబంధించి కమిటీ ఉన్నప్పటికీ.. విలువ ఇవ్వకుండా ఒక టీడీపీ కార్పొరేటర్, కొంత మంది వ్యక్తులు అడ్డుకుంటున్నారు. ఆలయంలో ప్రతి వేడుక పేరు చెప్పి దోచుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో కమిటీ సభ్యులు రాజీనామాలు చేయాలంటూ వేధింపులకు గురి చేస్తున్నట్లు సమాచారం. టీడీపీ కార్పొరేటర్ అమ్మవారి ఉత్సవాల్లో రూ.లక్షలు దోచుకున్నాడు. నిత్య అన్నదాన కార్యక్రమాన్ని నిలిపివేసి పేదల ఉసురు పోసుకున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతోపాటు గత ఏడాది అమ్మవారి ఉత్సవాల సమయంలో ఎంతో మంది వ్యాపారులకు డబ్బులు ఎగ్గొట్టారని తెలుస్తోంది. సుమారు రూ.కోటి వరకు ఖర్చు చేస్తారు. గత ఏడాది రూ. కోటిన్నర వరకు వసూలు చేశారని సమాచారం. ఉత్సవాలను తూతూ మంత్రంగా నిర్వహించి.. రూ.50 లక్షల వరకు కూటమి నేతలు దోచేశారని తెలుస్తోంది. ఈ ఏడాది ఉత్సవ కమిటీని ప్రజాప్రతినిధి చెప్పారనే కారణంతో అడ్డగోలుగా నియమించారు. సదరు ప్రజాప్రతినిధి, కార్పొరేటర్, సెల్‌షాప్ నిర్వాహకుడు, ప్రజాప్రతినిధి పీఏ వ్యవహరిస్తున్న తీరుతో ఆర్యవైశ్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమ సామాజిక వర్గానికి చెందిన ఆలయంలో వారి పెత్తనం ఏంటని ప్రశ్నిస్తున్నారు. చందాలు ఇచ్చేందుకు వారు గత ఏడాది లెక్కల గురించి ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. నిత్యాన్నదానానికి అనుమతులు లేవని చెబుతున్న కూటమి నేతలు.. అక్రమ వసూళ్లకు అనుమతులు ఎవరిచ్చారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఉత్సవ కమిటీ చైర్మన్ కోసం ప్రజాప్రతినిధికి రూ.5 లక్షలు అందాయనే ఆరోపణలు ఉన్నాయి.

పలు ఆలయాల్లో ఇదే తంతు

ఇటీవల కొత్తపేటలోని శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయానికి నూతన కమిటీ ఏర్పాటు చేసేందుకు పేర్లను దేవదాయ శాఖ కార్యాలయానికి పంపారు. ఇప్పటికే చైర్మన్, కమిటీలో చోటు వంటివి ఇప్పిస్తానని డబ్బులు వసూళ్లు చేసిన కూటమి నేతలను నిలదీస్తున్నారని తెలుస్తోంది. జనసేనకు సంబంధించిన ఒకరి నుంచి భారీగా నగదు తీసుకుని పేరు ప్రతిపాదించారని చెబుతున్నారు. ఇప్పటివరకు తాము కష్టపడి పని చేసినా.. కనీస గుర్తింపు ఇవ్వకుండా కాసుల కోసం పదవులు అప్పగిస్తున్నారని టీడీపీ నేతలు కూడా ఎమ్మెల్యే తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- చౌత్రాలోని శ్రీ రామాలయం కమిటీ ఏర్పాటులో కూడా పెద్ద ఎత్తున ఇలా అక్రమాలు జరిగాయని తెలుస్తోంది. ఏడాదిన్నరగా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నప్పటికీ అధికారులు చూడటం లేదు. దీనిపై భక్తులు మండిపడుతున్నారు.
- పాతగుంటూరులో శ్రీ గంగాపార్వతి సమేత అగస్తీశ్వరస్వామి, వేణుగోపాలస్వామి ఆలయానికి కమిటీ కోసం టార్గెట్ అమౌంట్ కేటాయించినట్లు సమాచారం. ఆలయానికి ఇంత అని ఇస్తే కమిటీలు ఏర్పాటు చేస్తామని.. స్థానిక ప్రజాప్రతినిధి అత్యంత సన్నిహితుడైన వ్యక్తి ఇప్పటికే అనేక మంది నుంచి డబ్బులు స్వాహా చేశారని తెలుస్తోంది.

పట్టించుకోని అధికారులు

స్థానిక ప్రజాప్రతినిధి చెప్పిన విధంగా దేవదాయ శాఖ అధికారులు వ్యవహరిస్తున్నారు. కనీసం ఆలయాల్లో జరుగుతున్న అవినీతి తంతును కూడా పట్టించుకోవటం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఎంతో విశిష్టత కలిగిన ఆలయాల్లో డబ్బులు తీసుకుని కమిటీలు వేస్తే.. గుడి ఆదాయానికి నష్టం వాటిల్లే అవకాశాలు ఉన్నాయని భక్తులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

మిర్చి యార్డు సమాచారం
(బుధవారం ధరలు)

వచ్చిన బస్తాలు	44,120
అమ్మకాలు	46,874
నిల్వ	15,094

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000-14,400
నంబరు-5	10,000-13,500
273	10,500-13,700
341	10,000-15,200
4884	10,000- 14000

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500-14,500
నంబరు-5	10,000-13,600
341	11,000-15,600
4884	10,000-14,200

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 15,300
బాడిగ 355	10,000 - 15,800
దేవనూరు డీలక్స్	10,000 - 14,000
ఆర్మూర్	9,800 - 12,500
తాలుకాయలు	6,200 - 8,000

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 15,200
బాడిగ 355	10,000 - 15,500
దువనూర్ డీలక్స్	10,500 - 14,500
తాలు	5,500 - 7,500

-కొరిటెపాడు (గుంటూరు)

కొంటాం అంటూనే... కొర్రీ!

- నాణ్యత సాకుతో పొగాకు తిరస్కారం
- ఏ గ్రేడు అయినా కొనేది లేదంటే ఏం చేయాలి?
- పొగాకును వదిలేసుకోవటం మినహా చేసేదేం లేదు
- బాపట్ల జిల్లా పొగాకు రైతుల నిర్వేదం


తెనాలి కొనుగోలు కేంద్రంలో బాపట్ల జిల్లా పొగాకు రైతులు

తెనాలి: ఆరుగాలం కష్టించి పండించిన పొగాకును అమ్ముకోవటానికి రైతులు అవస్థలు పడుతున్నారు. కొనుగోళ్ల కోసం నెలల తరబడి ఎదురుచూసి, తీరా కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చాక నాణ్యత లేదని తిరస్కరించటంతో దిక్కుతోచటం లేదంటున్నారు. పొగాకును వదిలేసి వెళ్లటం మినహా మరో మార్గం లేదని, ప్రభుత్వమే తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. వివరాలిలా ఉన్నాయి..

కొనుగోళ్లు కొంతే..

రాష్ట్రంలోని రైతులు పండించిన పొగాకు పంటకు గిట్టుబాటు ధర లేకపోవటంతో ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు ముందుకొచ్చింది. మార్క్‌ఫెడ్ బయ్యర్లను ఏర్పాటుచేసి పొగాకు కొనుగోళ్లను చేయిస్తోంది. ఈ క్రమంలో పొగాకు పండే ప్రాంతాల్లో గొడౌన్లు ఖాళీలేకపోవటంతో తెనాలిలోని రాష్ట్ర ప్రభుత్వ వేర్‌హౌసింగ్ గిడ్డంగిలో ఈనెల ఒకటో తేదీ నుంచి పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఆరంభించింది. గ్రామాల్లోని రైతు సేవాకేంద్రాల్లో పొగాకు రైతులకు షెడ్యూళ్లనిచ్చి, విడతలవారీగా ఏయే కొనుగోలు కేంద్రానికి ఎప్పుడు పొగాకు తీసుకెళ్లాలనేది మెసేజ్‌లను పంపుతున్నారు. ఆ ప్రకారం సమాచారం అందుకున్న బాపట్ల జిల్లా కారంచేడు, చీరాల ప్రాంత రైతులు పలువురు మంగళవారం రాత్రికి తమ పొగాకు బేళ్లతో సహా తెనాలిలోని కొనుగోలు కేంద్రానికి చేరుకున్నారు. బుధవారం ఉదయాన్నే బయ్యర్లు వచ్చి కొంత సరుకును మాత్రమే తీసుకుని మిగిలినది తిరస్కరించారు.

ఎంతోకొంతకు తీసుకోమన్నా..

పొగాకు కొనుగోలుకు ప్రభుత్వం మూడు గ్రేడ్లను నిర్ణయించింది. కిలో రూ.12, రూ.9, 6 చొప్పున నాణ్యత ప్రకారం కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడ కొందరు రైతులకు చెందిన పొగాకును కనిష్టమైన రూ.6లకు కూడా తీసుకోకుండా నిర్దాక్షిణ్యంగా తిరస్కరించారని రైతులు చెప్పారు. పొగాకును ఇక్కడకు తరలించటానికే బోలెడు ఖర్చయిందనీ, మళ్లీ ఇప్పుడు దీనిని ఎక్కడికి తీసుకెళ్లాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. బయ్యర్లు నాణ్యత తనిఖీకని బేళ్లను విడదీశారనీ, ఇప్పుడా పొగాకు దేనికీ పనికి రాదని వాపోతున్నారు. కనిష్ట ధరకు కాకపోయినా ఎంతో కొంతకు తీసుకోమని ప్రాధేయపడుతున్నా ఎవరూ పట్టించుకోవటం లేదంటున్నారు.

సంతకం ఫోర్జరీపై ముగిసిన విచారణ

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ సంతకాన్ని ఫోర్జరీ చేశారనే ఫిర్యాదులు రావడంతో ఆసుపత్రిలో నలుగురు వైద్యులతో కూడిన ప్రత్యేక కమిటీ ఐదు రోజులుగా విచారణ చేపట్టింది. ఇటీవల డీఎస్సీ టీచర్ ఉద్యోగాలకు దివ్యాంగుల కోటాలో ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన గుంటూరు జీజీహెచ్‌లో జరుగుతోంది. కొందరు వీటిలో ఫోర్జరీ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. బుధవారం జిల్లా కలెక్టర్‌కు షీల్డ్ కవర్‌లో నివేదిక అందించామని సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ తెలిపారు.

13న ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలతో సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్ : ప్రభుత్వ కళాశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 13న విజయవాడలోని రాఘవయ్యపార్కు వద్ద ఉన్న ఎంబీ భవన్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏపీ ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్ట్ అధ్యాపక సంఘ అధ్యక్షుడు డాక్టర్ వై.జాన్‌బాబు, కార్యనిర్వాహక కార్యదర్శి బీజే గాంధీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ జారీ అయిన ఉత్తర్వులు అమలు కాలేదన్నారు.

వాణిజ్యం
నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 1,800 గరిష్టం : రూ. 2,700

మోడల్ ధర రూ. 2,300

పసుపు ధరలు
(బుధవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 145

కొమ్ములు : 117 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,100	10,400	10,400

కాయలు : 28 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,100	10,400	10,400

మొత్తం అమ్మకాలు : 108.75 క్వింటాళ్లు

-దుగ్గిరాల

చేబ్రోలులో 49 మి.మీ. వర్షపాతం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు అత్యధికంగా చేబ్రోలు మండలంలో 49 మిల్లీ మీటర్లు, అత్యల్పంగా ప్రత్తిపాడు మండలంలో 0.6 మి.మీ. వర్షం పడింది. సగటున 10.5 మి.మీ.గా వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. గుంటూరు తూర్పులో 28.4 మి.మీ., కాకుమాను 24.2, గుంటూరు పశ్చిమ 23.2, మంగళగిరి 16.8, పెదకాకాని 12.2, దుగ్గిరాల 7.8, తుళ్ళూరు 6.2, మేడికొండూరు 5.2, తెనాలి 4, పొన్నూరు 3.4, కొల్లిపర 3.2, తాడికొండ 2.2, తాడేపల్లి 1.4, ఫిరంగిపురం మండలంలో 0.8 మి.మీ. చొప్పున వర్షం పడింది.

వైఎస్సార్‌సీపీలో పదవుల నియామకం

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు జిల్లాలో పలువురిని పలు పదవుల్లో నియమించారు. ఈ మేరకు బుధవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. తాడికొండ నియోజకవర్గానికి చెందిన దాసరి కత్తెరేణమ్మను మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, మంగళగిరి నియోజకవర్గానికి చెందిన భుక్యా శాలినిని మహిళా విభాగం సహాయ కార్యదర్శిగా, తాడికొండ అసెంబ్లీకి చెందిన కందుల సిద్దయ్యను బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా, మంగళగిరి నియోజకవర్గానికి చెందిన చిన్నపోతుల దుర్గారావును ఎస్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, ఐటీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా కోనా రుతిక్‌రెడ్డి, పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా మహ్మద్ ఫిరోజ్, తాడికొండ నియోజకవర్గానికి చెందిన ముత్యాల బాలస్వామిని పబ్లిసిటీ విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా, ఆరేపల్లి జోజిని పంచాయతీరాజ్ విభాగం సహాయ కార్యదర్శిగా నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అంగన్‌వాడీ విభాగ అధ్యక్షురాలిగా గుంటూరు తూర్పు నియోజకవర్గానికి చెందిన సత్తెనపల్లి రమణిని నియమించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడిగా కానూరు శశిధర్, విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా పిడతల భానుప్రకాష్‌లను నియమించారు.

సరుకు రవాణా లక్ష్యాన్ని చేరుకోవాలి

లక్ష్మీపురం: గూడ్స్, పార్సిల్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు గుంటూరు డివిజన్ అధికారులు అందుబాటులో ఉంటారని గుంటూరు రైల్వే డివిజనల్ డీఆర్‌ఎం సుధేష్ణ సేన్ అన్నారు. గుంటూరు పట్టాభిపురంలోని డీఆర్‌ఎం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన గూడ్స్, పార్సిల్ వినియోగదారులు బిజినెస్ డెవలప్‌మెంట్ యూనియన్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ సరుకు లోడింగ్‌ను పెంచి లక్ష్యాన్ని సాధించేందుకు సహకరించాల్సిందిగా కోరారు. సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి స్కూల్ గేమ్స్ జిల్లా జట్ల ఎంపికలు

నరసరావుపేట ఈస్ట్: పాఠశాల విద్యాశాఖ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11నుంచి 19వరకు వివిధ క్రీడాంశాలలో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు డీఈఓ ఎల్.చంద్రకళ, స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్, మహిళా కార్యదర్శి వి.పద్మావతి బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా ఎంపికలు స్పెల్- 1లో భాగంగా అండర్-14, అండర్-17 బాలుర, బాలికల విభాగంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. పోటీల్లో భాగంగా ఈనెల 11న నందిగామ జెడ్పీ హైస్కూలులో సెపక్‌తక్రా, 12న డీఎస్‌ఏ స్టేడియంలో కరాటే, 15న చిలకలూరిపేట ఏఎంజీ పాఠశాలలో జూడో, గట్కా, 16న డీఎస్‌ఏ స్టేడియంలో ఫుట్‌బాల్, 17న అచ్చంపేట గురుకుల పాఠశాలలో రగ్బీ, 18న ఎస్ఎస్ అండ్ ఎన్ కళాశాల స్విమ్మింగ్ పూల్‌లో ఈత, 19న ఏఎంజీ పాఠశాలలో బాక్సింగ్, అచ్చంపేటలో రెజ్లింగ్ (కుస్తీ) పోటీలు నిర్వహిస్తున్నట్టు వివరించారు.

ఏపీఆర్ఎస్ఏ క్రీడా పోస్టర్ ఆవిష్కరణ


ఉద్యోగ సంఘ నాయకులతో కలిసి పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేసీ అశుతోష్ శ్రీవాత్సవ

గుంటూరు వెస్ట్: ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర స్థాయి క్రీడా పోస్టర్‌ను జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ బుధవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్ మాట్లాడుతూ నవంబర్ 7, 8, 9వ తేదీల్లో అనంతపురంలో రెవెన్యూ స్పోర్ట్స్ మీట్‌కు జిల్లా నుంచి 55 మంది పాల్గొంటారని తెలిపారు.

13న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సదస్సు

లక్ష్మీపురం: ఈ నెల 13న జరిగే రాష్ట్ర స్థాయి సదస్సును జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ పిలుపునిచ్చారు. గుంటూరు నగరంలోని కొత్తపేట సీపీఐ జిల్లా కార్యాలయంలోని మల్లయ్యలింగం భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో నాసర్‌జీ మాట్లాడుతూ విద్య, వైద్యరంగాల ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బాలనవ్యశ్రీ , జిల్లా సహాయ కార్యదర్శి అమర్నాథ్ పాల్గొన్నారు.

పేదల కోసం పోరాడిన వీరనారి ఐలమ్మ


ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అంబటి రాంబాబు, పార్టీ శ్రేణులు

నగరంపాలెం: భూమి, భుక్తితో పాటు వెట్టి నుంచి విముక్తి కోసం పోరాడిన వీరనారి చిట్యాల ఐలమ్మ అని మాజీ మంత్రి, వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు అన్నారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం చిట్యాల ఐలమ్మ 40వ వర్ధంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ మహిళలపై చిన్నచూపు కనబరిచే ప్రతి ఒక్కరికి ఆమె పోరాటం కనువిప్పు కలిగించిందని పేర్కొన్నారు. పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిందన్నారు. పేదల విముక్తి కోసం పోరాడిన వీరనారి అని అన్నారు. అదే విధంగా భూమి కోసం సాహించిన తొలి మహిళని చెప్పారు. కార్యక్రమంలో అరవింద్, వసంత్, పోకల వెంకటేశ్వర్లు, కొల్లూరు శివప్రసాద్, సుబ్బు, దుర్గాదేవి, బద్రి, గౌరీశంకర్, కిషోర్, శంకర్ పాల్గొన్నారు.

విధి నిర్వహణకు వసతులు కీలకం


రిబ్బన్ కత్తిరించి భవనాన్ని ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

తాడికొండ: విధి నిర్వహణకు అవసరమైన వసతులు కల్పించాల్సిన అవసరం ఉందని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. రాజధాని ప్రాంతంలో ఇతర జిల్లాల నుంచి విధులు నిర్వర్తించడానికి హాజరయ్యే పోలీస్ సిబ్బందికి వసతి నిమిత్తం తుళ్లూరు గ్రామంలో ఎస్‌ఏసీ కార్యాలయాన్ని బుధవారం పునరుద్ధరించారు. ఎస్పీ చేతుల మీదుగా దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ ఐటీ శాఖ మంత్రి కార్యాలయం సహకారంతో సీఎస్‌ఆర్ కింద రూ.10 లక్షల వ్యయంతో పునరుద్ధరణ చేశామని తెలిపారు. సుమారు 100 మందికి సౌకర్యవంతంగా ఉండేలా గదులు సిద్ధం చేశామన్నారు.

12న ల్యాబ్ ఇన్‌స్ట్రక్టర్ ఎంపికకు ముఖాముఖి

గుంటూరు రూరల్: నల్లపాడు గ్రామంలోని పీఎం కేంద్రియ విద్యాలయంలో అటల్ టింకరింగ్ ల్యాబ్ (ఏటీఎల్) నందు ఇన్‌స్ట్రక్టర్ ఉద్యోగాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని పాఠశాల ప్రిన్సిపల్ బి.శేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీటెక్ ఈసీఈ ఉత్తీర్ణులు 12వ తేదీన తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాఠశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరవ్వాలని తెలిపారు.

తురకపాలెంలో ఎన్‌సీడీసీ బృందం పర్యటన

గుంటూరు రూరల్: వరుస మరణాలతో ప్రాణభయంతో బతుకుతున్న తురకపాలెం గ్రామంలో నేషనల్ సెంటర్ ఫర్ డిసీస్ కంట్రోల్ బోర్డ్ (ఎన్‌సీడీసీ) సభ్యుల బృందం బుధవారం పర్యటించారు. రెండు రోజులుగా గ్రామంలో పర్యటిస్తున్న బృందం అనారోగ్యాలతో మృతి చెందిన వారి ఇళ్లకు వెళ్లి కుటుంబసభ్యులను అడిగి వివరాలు తెలుసుకుంటోంది. రోగుల రిపోర్ట్‌లను సభ్యులు పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న మెడికల్ క్యాంపును సందర్శించారు. ప్రజల నుంచి గత వారంగా సేకరిస్తున్న బ్లడ్ శాంపిల్స్, వాటి ఫలితాలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో బుధవారం ఎన్‌సీడీసీ బృందం పర్యటించిందని, స్థానికుల మరణాలకు కారణాలపై విశ్లేషణ కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి తెలిపారు.

కెనాల్‌లో కుళ్లిన స్థితిలో మృతదేహాలు

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని అమరారెడ్డి నగర్ బకింగ్‌హామ్ కెనాల్‌లో రేవేంద్రపాడు వెళ్లే మార్గంలో గుర్తు తెలియని రెండు మృతదేహాలు ఉన్నాయని తెలిపినా పోలీసులు పట్టించుకోవడం లేదని స్థానిక మహిళలు బుధవారం వాపోయారు. వారు మాట్లాడుతూ... ఎన్నిసార్లు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తొమ్మిది రోజులుగా ఆ మృతదేహాలు ముళ్లకంచెల్లో ఇరుక్కుపోయి దుర్వాసన వస్తోందన్నారు. వారిని హత్య చేసి పడేశారా? లేదా ఆత్మహత్య చేసుకున్నారా? అనే విషయాలు పోలీసులు నిర్ధారించాల్సిన అవసరం ఉంది. పోలీసుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.